

బీజేపీతోనే దేశాభివృద్ధి

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్‌కుమార్ అన్నారు. 8లో▸



సిగరెట్ కోసం వచ్చి..

జిల్లాలో చైన్‌స్నాచర్లు ఆదివారం హల్‌చల్ చేశారు. ఒకే రోజు వికారాబాద్, పరిగి, కుల్కచర్లలో కలకలం రేపారు. 8లో▸



మినుము.. గోడు వినుమా!

ఆరుగాలం శ్రమించిన రైతన్నలకు వరుణుడి ప్రకోపంతో తీవ్ర నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. 9లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భీంరెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. కుల్కచర్లలో శివాలయ నిర్మాణానికి ఆదివారం భారతమ్మ భీంరెడ్డి దంపతులు లక్ష 20 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమవంతు సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, నాయకులు ఆనందం, ఈశ్వరయ్య, ప్రకాష్, శ్రీశైలం, వినోద్, శివ సంతోష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఏకగ్రీవం

కుల్కచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లిలో దేవీనవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జంగం మల్లయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రెడ్డి, కోశాధికారిగా మందుల శంకర్, కార్యవర్గ సభ్యులుగా రఘు, అంజిలయ్య, కురుంపల్లి నర్సింలు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, గోపాల్ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 3నుంచి 13వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సలహాదారులు యాదయ్య, వెంకటేష్, చంద్రయ్య, మల్లయ్య, మొగులయ్య, నరేష్, చిన్నయ్య, రాములు, భీంసింగ్, నర్సింలు, రామయ్య, బాలచంద్రయ్య, రాంజీ, రాంచంద్రయ్య, కిష్టయ్య, డీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


'గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర' పోస్టర్ ఆవిష్కరణ

హుడాకాంప్లెక్స్: రవీంద్రభారతిలో అక్టోబర్ 9న జరిగే 'గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర – 2024'ను జయప్రదం చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో ఆదివారం యాత్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోవును ఒక ప్రాణిగా కాకుండా తల్లిగా గౌరవించడం భారతజాతి లక్షణమని అన్నారు. గోమాతకు జాతీయమాతగా గౌరవించడం.. గో హత్యను నిర్మూలించే భారతదేశాన్ని నిర్మించేందుకు దేశవ్యాప్తంగా 'గో ప్రతిష్ఠ' పేరుతో ఆందోళన కార్యక్రమం నడుస్తోందని ఆయన తెలిపారు.

రీజినల్ టెన్షన్

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై రైతుల్లో చర్చ

- ప్రతిపాదిత గ్రామాల్లో ఉత్కంఠ
- తమ గ్రామం పక్క నుంచి వెళ్లాలి.. కానీ మా పొలాలు పోకుంటే చాలు
- అందరి నోటా ఇదే మాట



రీజినల్ రింగ్‌రోడ్డు కొత్త ప్రతిపాదిత నమూనా

వికారాబాద్: జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే చర్చ జరుగుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ జిల్లా మీదుగా వెళ్లేలా ప్రభుత్వం కొత్త ప్రతిపాదన చేసి కేంద్రానికి నివేదించిన నేపథ్యంలో ఈ చర్చ మొదలయ్యింది. ట్రిపుల్ ఆర్ జిల్లా మీదుగా వెళుతుండటం దాదాపు ఖరారయ్యిందని వస్తున్న వార్తల నేపథ్యంలో చర్చ జోరందుకుంది. తాజాగా రియల్టర్లు, ప్రజాప్రతినిధుల నోట ఈ మాటే వినిపిస్తుండటం.. తరచూ వార్తలు వస్తున్న నేపథ్యంలో చర్చ ఊపందుకుంది. గతంలో ప్రతిపాదించిన డీపీఆర్ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు పడమర ప్రాంతంలో మన జిల్లాకు దిగువన రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంత గ్రామాల నుంచి వెళ్లేలా తయారు చేశారు. మన జిల్లాకు సంబంధించి ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలోంచి మాత్రమే వెళ్లేది. రీజినల్ రింగ్ రోడ్డు జిల్లా మీదుగా వెళుతుందా..? లేదా..? అనే విషయంలో ప్రజల్లో సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పోలిస్తే మన జిల్లా సరిహద్దు కలిగి ఉన్న పడమర ప్రాంతంలో ట్రిపుల్ ఆర్ హైదరాబాద్‌కు తక్కువ దూరం నుంచి నిర్మిస్తున్నారని జిల్లా నేతలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. మిగతా భాగాల్లో హైదరాబాద్‌కు 60 నుంచి 90 కిలోమీటర్ల దూరం నుంచి ట్రిపుల్ ఆర్ నిర్మించేలా అలైన్‌మెంట్ తయారు చేయగా మన జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరం నుంచే వెళ్లేలా అలైన్‌మెంట్ తయారు చేశారు. దీంతో పశ్చిమ ప్రాంతాన ఉన్న వికారాబాద్ జిల్లాకు అన్యాయం జరుగుతుందని, అభివృద్ధి పరిధిలోకి జిల్లా రాకుండా పోయే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చి పంపడంతో ఇప్పుడు రోడ్డు నిర్మాణంలో ఎవరి భూములు పోతాయి..? అనే చర్చ మొదలయ్యింది.

రైతుల్లో ఆందోళన

ట్రిపుల్ ఆర్ జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర భాగం అలైన్‌మెంట్ మారుస్తూ ప్రతిపాదనలు పంపారని వార్తలు రావటమే కాకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు దీన్ని ధ్రువీకరిస్తున్నారు. తమ విజ్ఞప్తి మేరకు సీఎం జిల్లాను కలుపుతూ వెళ్లేలా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని అధికారులకు సూచించినట్టు పరిగి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ బాహాటంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారుల బృందం సీఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన సూచనల మేరకు అలైన్‌మెంటు మారుస్తూ ఎక్స్‌ప్రెస్ వే అథారిటీకి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. కొత్తగా ప్రతిపాదించిన ఏరియాతో తయారు చేసిన మ్యాప్‌ను కూడా నెట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో నూతన ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు వెళుతుందని భావిస్తున్న గ్రామాల రైతుల్లో టెన్షన్ మొదలయ్యింది. ఒకవేళ వెళితే తమ గ్రామానికి ఎటు వైపు నుంచి వెళుతుంది..? ఎవరి పొలాల్లోంచి వెళుతుంది..? తమ పొలంలోంచి వెళుతుందా..? పక్క పొలంలోంచి వెళుతుందా..? అని చర్చించుకుంటున్నారు. తమ గ్రామం మీదుగా వెళ్లాలి.. అభివృద్ధి జరగాలి.. కానీ తమ పొలాలు పోకుంటే బాగుండు దేవుడా.. అంటూ వేడుకుంటున్నారు.

రియల్టర్ల హడావుడి

గతంలో తయారు చేసిన డీపీఆర్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌లో పడమర ప్రాంతంలో మన జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆలూరు – కొకుంట్ల గ్రామాల మధ్యలోంచి తంగెడుపల్లి మీదుగా వెళ్లేలా ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనల్లో మన జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట మండలాలకు చెందిన ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలోంచి ట్రిపుల్ ఆర్ వెళ్లేలా డిజైన్ చేశారు. తాజాగా పేర్కొన్న ప్రతిపాదనల్లో జిల్లా పరిధిలోని నాలుగు మండలాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ వెళుతుంది. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని పదికి పైగా గ్రామాలు రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలోకి వస్తుండగా వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని రెండు మూడు గ్రామాలను కలుపుతూ వెళ్లేలా ఈ కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో రియల్టర్ల జోరు ఊపందుకుంది. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ అందుబాటులో ఉన్న సమాచారంతో ట్రిపుల్‌ఆర్ ఏయే గ్రామాలు, గ్రామాలకు ఎటు వైపు నుంచి వెళుతుందనే విషయాన్ని అంచనా వేస్తూ ఆయా ప్రాంతాల్లో భూములు కొనుగోలుకు యత్నిస్తున్నారు. కొన్ని చోట్ల అగ్రిమెంట్లు కూడా చేసుకుంటున్నారు.

జాతీయస్థాయి పోటీలకు సాయికిరణ్

రాష్ట్రస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారుడు



బంగారు పతకంతో సాయికిరణ్

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన సాయికిరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్ విభాగంలో విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించారు. ఆరు కిలోల షాట్‌పుట్ విభాగంలో 16.21 మీటర్ల విసిరి మొదటి స్థానంలో నిలిచారు. అక్టోబర్ 19న ఏపీలోని గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. గ్రామానికి చెందిన సాయికిరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని స్థానికులు, స్నేహితులు అన్నారు.



అనంతగిరికి పర్యాటకుల తాకిడి

▲ అడవిలో విహరిస్తున్న పర్యాటకులు

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఓవైపు వర్షాలు కురుస్తున్నా యువకులు, కుటుంబ సభ్యులు గుట్టకు వచ్చారు. ముందుగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని అనంతరం అడవిలో వ్యూ పాయింట్‌ల వద్ద విహరిస్తూ ఆనందంగా గడిపారు.

– అనంతగిరి

కేవీ రమేష్‌రాజుకు లయన్స్ క్లబ్ అవార్డు

ఇబ్రహీంపట్నం: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320సి అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం లయన్ కేవీ రమేష్‌రాజు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ లయన్ ఇమేజ్ అవార్డును దక్కించుకున్నారు. నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. హరీష్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో గురునాథ్‌రెడ్డి తదితరులు

కొడంగల్ రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని షాబజార్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో దాతలు ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మిలాద్ కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

తెలంగాణ కళాకారుల నిరుద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘు

అనంతగిరి: రాష్ట్రంలోని నిరుద్యోగ ఉద్యమ కళాకారులను ఆదుకొని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ కళాకారుల నిరుద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కళలనే నమ్ముకుంటూ సమాజంలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఖమ్మం వరద బాధితుల సహాయార్థం నిధులు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, కళాకారుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకటేశం, మమత, అంజిలప్ప, కృష్ణ, శ్రీనివాస్, పెంటప్ప, విజయ్, రాజశేఖర్, అనిత, రేణుక, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజే తరువాయి



పాత కొడంగల్ శివారులో గురుకులాల కోసం ఎంపిక చేసిన స్థలం

- ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్
- ఒకే చోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు
- అక్టోబర్‌లో భవన నిర్మాణాలకు శంకుస్థాపన
- సుమారు రూ.వంద కోట్లతో పనులు

కొడంగల్: ప్రభుత్వ విద్యను పేదలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌కు సమీకృత గురుకుల విద్యా సంస్థలను (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్) మంజూరు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో కొడంగల్, మధిర, లక్ష్మీపురంలో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఈ స్థలంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల నడుస్తోంది. ఈ గురుకులంలో సుమారు ఐదు వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా భవనాన్ని నిర్మించారు. ఇక్కడే సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, బీసీ గురుకుల పాఠశాలను నిర్మించనున్నారు. అధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఈ ప్రాంతం ఇప్పుడు విద్య, వైద్యం, రవాణా వైపు దూసుకెళ్తోంది. సుమారు రూ.వంద కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మించనున్నారు.

విద్యా కేంద్రంగా కొడంగల్

సమీప భవిష్యత్‌లో కొడంగల్ విద్యా కేంద్రంగా మారనుంది. ఇప్పటికే మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, కొత్త మండలాలకు జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు. త్వరలో ఆయూష్ కళాశాలను మంజూరు చేసే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

- బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.7.13 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు.
- కొడంగల్ మండలం ఎరన్‌పల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. భవన నిర్మాణం, మౌలిక వసతుల కోసం రూ.124.50 కోట్లు విడుదల చేశారు.

అక్టోబర్‌లో భూమిపూజ



సమీకృత గురుకుల విద్యా సంస్థల కోసం పాత కొడంగల్ శివారులో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాం. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో అధునాతన భవనాలు నిర్మిస్తారు. అక్టోబర్ నెలలో భూమిపూజ జరిగే అవకాశం ఉంది. సీఎస్ అధ్యక్షతన కమిటీ వేశారు. పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఇందులో ఉన్నారు. వారి నిర్ణయం మేరకు ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాల నిర్మాణం జరుగుతుంది.

– వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి, కొడంగల్

- ఎరన్‌పల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తారు. ఇందు కోసం రూ.46 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.27 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- కొడంగల్ పట్టణంలో 220 పడకల ప్రభుత్వ టీచింగ్ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. దీని కోసం రూ.27 కోట్లు కేటాయించారు.
- కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం కోసం రూ.30 కోట్లు మంజూరు చేశారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11 కోట్లు విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాల కోసం ఒక్కో దానికి రూ.20 కోట్ల చొప్పున విడుదల చేశారు.

ఆయూష్ కళాశాల మంజూరు చేయాలి

- కొడంగల్‌కు ఆయూష్ కళాశాలను మంజూరు చేయాలని విద్యావంతులు కోరుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి చెందిన వందలాది మంది విద్యార్థులు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆయూష్ కళాశాలను ఏర్పాటు చేస్తే వారికి మేలు జరుగుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతానికి చెందిన విద్యావంతులు.. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకుకు గాయాలు




చికిత్స పొందుతున్న నరేందర్‌, తుకారాం

తాండూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రి కొడుకులను వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన తాండూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గోనూరు గ్రామానికి చెందిన నరేందర్‌.. పట్టణంలోని బీసీ గురుకుల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న కుమారుడు తుకారాంను చూసేందుకు తాండూరుకు వచ్చాడు. అమ్మను చూడాలని ఉందని బాలుడు చెప్పడంతో అధికారుల అనుమతితో కుమారున్ని తీసుకుని, ద్విచక్ర వాహనంపై గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో పట్టణంలోని రైల్వే వంతెన పైనుంచి వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన మరో బైక్‌ వీరిని ఢీకొట్టింది. దీంతో వారు ఎదురుగా వస్తున్న కారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఇద్దరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం నగరానికి తరలించారు.

మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి



మోమిన్‌పేట: మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా ఎర్రన్నోళ్ల మహేందర్‌ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం వ్యవసాయ శాఖ కోఆపరేటివ్‌ రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఆదేశాలు జారీ చేశారు. వైస్‌ చైర్మన్‌గా మల్లేశ్‌ యాదవ్‌తో 12మంది సభ్యులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులుగా నిర్మల, ఉప్పరి రమేష్‌, మేతారి సుగ్రీవ, కటికే షౌకత్‌, పి.రాజశేఖర్‌, గాండ్ల నర్సింలు, ఎస్‌.నర్సింలు, పి.యాదగిరి, ఎస్‌.ఇసాక్‌, బంటు వెంకటేశం, చాకలి శివరాజ్‌, డి.కృష్ణారెడ్డిలను ఎన్నుకున్నట్లు సమాచారం. మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం మండలాలతో కూడిన మార్కెట్‌ కావడంతో అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే మోమిన్‌పేట మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డిని చైర్మన్‌గా, మర్పల్లి గ్రామానికి చెందిన మల్లేశ్‌ను వైస్‌ చైర్మన్‌గా నియమించారు. జిల్లా మార్కెట్‌ కార్యాలయం నుంచి స్పష్టత రావాల్సి ఉందని మర్పల్లి మార్కెట్‌ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ఏఎస్‌ఐ మల్లేశం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థినులు

మర్పల్లి: సమాజంలో బాల్య వివాహాలు చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఐ మల్లేశం హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. చిన్నతనంలో ఆడపిల్లకు పెళ్లిళ్లు చేస్తే అనేక రుగ్మతలకు గురవుతారని తెలిపారు. ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలిచే విధంగా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిపితే వెంటనే పోలీసులు లేదా చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ 1098, సాధన సంస్థకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం సైబర్‌ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వసతిగృహం వార్డెన్‌ తుల్జారాంగౌడ్‌, సంస్థ కోఆర్డినేటర్‌ యాదయ్య, పోలీస్‌ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి సదస్సును జయప్రదం చేయండి



రామస్వామి

షాబాద్‌: ఏఐటీయూసీ సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న తుక్కుగూడ, 24న శంషాబాద్‌లో రాష్ట్రస్థాయి కౌన్సిల్‌ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. తుక్కుగూడ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో కార్మికుల భద్రత, వారి హక్కుల కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారని వెల్లడించారు.



సేద తీరుతున్న పర్యాటకులు

ప్రకృతి ఒడిలో పరవశం

కోట్‌పల్లి అందాలను ఆస్వాదించిన పర్యాటకులు

ధారూరు: కోటపల్లి జలాశయం పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సకుటుంబ సమేతంగా ప్రాజెక్టు పరిసర ప్రాంత అందాలను ఆస్వాదించేందుకు వేలాది మంది బారులు తీరారు. ఈ సందర్భంగా జలాశయంలో బోటింగ్‌ చేస్తూ కేరింతలు కొట్టారు. ప్రాజెక్టు అలుగుపై నుంచి జాలువారుతున్న జలపాతాన్ని చూస్తూ పరవశించిపోయారు. సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్‌ చేశారు.



సెల్ఫీ దిగుతున్న యువతులు

వైద్య శిబిరం అభినందనీయం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైట్‌ ప్యాలెస్‌ ఫంక్షన్‌ హాల్‌లో జమాతే ఉలేమా హింద్‌, హెల్పింగ్‌ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎమ్మార్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్నపరిమళలు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో పేదలకు మేలు చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన కేర్‌ హాస్పిటల్‌, ఇంటిగ్రో ఆస్పత్రి వైద్యులు 1100 మందికి వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సలు చేసేందుకు రెఫర్‌ చేశారు. జామాతే ఉలేమా హింద్‌ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్‌ పీర్‌ శబ్బీర్‌ అహ్మద్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ముస్లిం వెల్ఫేర్‌ అధ్యక్షుడు కమల్‌అతార్‌, నాయకులు, ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కుక్క కాటుతో బాలుడికి గాయాలు

మోమిన్‌పేట: మోమిన్‌పేట గ్రామానికి చెందిన బాలుడు మోహిజ్‌ను కుక్క కాటు వేసింది. ఆదివారం ఉదయం తండ్రి మహ్మద్‌ పాషతో కలిసి టిఫిన్‌ సెంటర్‌కు వెళ్లిన బాలుడిపై.. వీధి కుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో బాలున్ని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి



పెద్దేముల్‌: పార్టీ సభ్యత్వం నమోదు చేయిస్తున్న కమలనాథులు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్‌

పెద్దేముల్‌: దేశ అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్‌కుమార్‌ అన్నారు. ఆదివారం మండల పరిధి మంబాపూర్‌ గ్రామంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశానికి విశ్వవ్యాప్త గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు, భద్రత పార్టీతోనే సాధ్యమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేస్తామని చెప్పారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్‌గౌడ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్‌, జిల్లా కార్యదర్శి బంట్వారం భద్రేశ్వర్‌, కార్యవర్గ సభ్యులు సందీప్‌కుమార్‌, భూమి నర్సింహ, శంకర్‌జీ, రవిందర్‌, సాయికుమార్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

మర్పల్లి: గ్రామాల్లో బీజేపీ బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌ రాథోడ్‌ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మండల పరిధి సిరిపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్‌, జిల్లా కోఆర్డినేటర్‌ వడ్ల నందుతో కలిసి ఆయన సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. దీంతో సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. కార్యకర్తలు, బూత్‌ లేవల్‌ నాయకులే పార్టీకి కీలకం అని పేర్కొన్నారు. నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సభ్యత్వ నమోదుపై పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌ యాదవ్‌, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగయ్య, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, శాంతప్ప, నాయకులు శ్రీధర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌, జైపాల్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.



మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి. చిత్రంలో ప్రేమ్‌సింగ్‌

సిగరెట్‌ కోసం వచ్చి.. చోరీలు

జిల్లాలో చైన్‌స్నాచర్ల హల్‌చల్‌!

- ఒకే రోజు మూడు ప్రాంతాల్లో సంచరించిన కేటుగాళ్లు
- వికారాబాద్‌లో మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ



అనంతగిరి: ఘటన జరిగిన ప్రదేశంలో గుమికూడిన స్థానికులు



ధారూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతగిరి/కుల్కచర్ల/ధారూరు: జిల్లాలో చైన్‌స్నాచర్లు ఆదివారం హల్‌చల్‌ చేశారు. ఒకే రోజు వికారాబాద్‌, పరిగి పట్టణాలతో పాటు కుల్కచర్ల మండల కేంద్రంలో కలకలం రేపారు. అనంతగిరిలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న మహిళను సిగరెట్‌ కావాలని అడిగిన దుండగుడు.. సిగరెట్‌ ఇస్తున్న క్రమంలో సదరు మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. కుల్కచర్లలో మరో మహిళ మెడలోంచి గొలుసు లాగే యత్నం చేయగా.. ఫలించలేదు. దీంతో అక్కడి నుంచి దుండగులు ఉడాయించారు. జరిగిన రెండు సంఘటనల నేపథ్యంలో ఈ మూడు ప్రాంతాల్లో స్కూటీపై తిరిగింది ఒకరేనా.. లేక మరో ముఠా ఏదైనా ఉందా అని ప్రజలు, పోలీసులు అనుమానిస్తున్నారు.

గొలుసు అపహరణ

మహిళ మెడలో నుంచి ఓ దొంగ పుస్తెల తాడును లాక్కెళ్లిన ఘటన వికారాబాద్‌ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని 31వ వార్డు శివరాంనగర్‌ కాలనీలో విద్యావతి అనే మహిళ దుకాణం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సిగరెట్‌ కావాలని అడిగాడు. ఆమె సిగరెట్‌ ఇస్తున్న క్రమంలో సదరు వ్యక్తి ఆమె మెడలోని పుస్తెల తాడును లాక్కెళ్లాడు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే దుండగుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

పోలీసుల తనిఖీలు

వికారాబాద్‌, పరిగి, కుల్కచర్లలో చైన్‌ స్నాచర్లు సంచరిస్తున్నారన్న సమాచారంతో ధారూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. తాండూరు-వికారాబాద్‌ వయా ధారూరు మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని ఆపి వివరాలు సేకరించారు. వాహన పత్రాలను పరిశీలించారు.

ప్రతిఘటించిన మహిళ



సీసీకెమెరా ఆధారంగా.. అనుమానితుల చిత్రం

కుల్కచర్ల గ్రామంలో రత్నమాల అనే మహిళ కిరాణ దుకాణానికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. తాగునీటి బాటిల్‌ అడిగారు. అనంతరం సిగరెట్‌ కావాలని కోరగా.. ఆమె ఇస్తున్న క్రమంలో ఓ వ్యక్తి ఆ మహిళ మెడలోని బంగారు గొలుసును లాగాడు. మహిళ ప్రతిఘటించడంతో.. చైన్‌ తెగి ఆమె చేతిలోనే పడింది. దీంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లి.. వలకు చిక్కి

వాగులో వ్యక్తి మృత్యువాత




అంజయ్య మృతదేహం

షాద్‌నగర్‌రూరల్‌: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వలకు చిక్కుకొని మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధి అయ్యవారిపల్లి శివారులో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. చౌలపల్లి గ్రామానికి చెందిన కుర్వగూడెం అంజయ్య(50), యాదమ్మ దంపతులు. అయ్యవారిపల్లి సమీపంలోని వాగులో నీరు పారుతుండటంతో చేపల పట్టేందుకు వెళ్లారు. వలను వాగులో వేసిన ఆంజనేయులు.. కొద్ది సేపటి తరువాత చేపలు పడ్డాయని చూసేందుకు వాగులోకి దిగాడు. అతని కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆ సమయంలో ఒడ్డున కూర్చున్న భార్య యాదమ్మ భర్తకోసం ఎంతసేపు చూసినా బయటకు రాలేదు. దీంతో భర్త నీటిలో మునిగిపోయాడునుకుని చుట్టుప్రక్కల వారికి విషయాన్ని చెప్పింది. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రాంచందర్‌.. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. ఫైర్‌ స్టేషన్‌ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

‘బెల్టు’ దుకాణాలు మూసేయండి

నిరాహార దీక్ష చేపట్టిన యువకుడు



శేఖర్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్‌ నాయకులు

షాద్‌నగర్‌ రూరల్‌: ‘పచ్చని పల్లెల్లో బెల్టు షాపులు చిచ్చు పెడుతున్నాయి. యువకులు మద్యానికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. వెంటనే మద్యం విక్రయ దుకాణాలను ఎత్తివేయాలి’ అని గ్రామానికి చెందిన ఓ యువకుడు డిమాండ్‌ చేశారు. బెల్టు షాపులను మూసివేయాలని కోరుతూ.. ఆదివారం మండల పరిధి కిషన్‌నగర్‌ గ్రామంలో నదుల్ల శేఖర్‌ అనే వ్యక్తి అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సుమారు 30 మద్యం దుకాణాలు ఉన్నాయని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు జోరుగా విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో గ్రామ ప్రజలు అత్యధికంగా మద్యం మత్తులో జోగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ మైకంలో ఇంటా బయట గొడవలు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామ సంక్షేమాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని కోరారు. లేని పక్షంలో నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామని శేఖర్‌ స్పష్టంచేశారు. మద్దతు తెలిపిన వారిలో పాండు, యాదయ్య, జోగు భూషణ్‌, చాకలి మల్లయ్య, ఎల్లంపల్లి శ్రీను, పెంటయ్య, మహేశ్‌, రాజు, కృష్ణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కడ్తాల్‌ మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. సీఐ శివప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్‌ పట్టణానికి చెందిన వరికుప్పల మహేశ్‌.. హైదరాబాద్‌–శ్రీశైలం జాతీయ రహదారి దాటుతుండగా ఆమనగల్లు నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి పంపించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి అన్న వెంకటేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

యాలాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి గోరేపల్లిలో జరిగింది. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాలప్ప(25) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన లాలప్ప.. తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గట్టుపై ఉన్న చెప్పులు, బట్టలను గమనించిన గ్రామస్తులు.. చెరువులోంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫెన్సింగ్‌ వైరు తగిలి వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల: ఓ రైతు తన పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్‌ ఫెన్సింగ్‌ను తాకి మరో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఊరేళ్ల గ్రామంలో ఓ రైతు.. కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. అడవి పందుల బెడద ఎక్కువ ఉండడంతో పంట చుట్టూ ఫెన్సింగ్‌ వైరు ఏర్పాటు చేశాడు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన నల్లోల రాజు(35) మొక్కజొన్న కంకులు, పూలు కోసుకునేందుకు పొలంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో రాజు.. ప్రమాదవశాత్తు ఫెన్సింగ్‌ వైర్లకు తాకి మృత్యువాత పడ్డాడు. మూడు రోజులుగా అటు వైపు ఎవరూ వెళ్లకపోవడంతో శవం కుళ్లిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్‌: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయిలో నివాసముంటున్న నాగరాజు (40) ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై 4,5 రోజులుగా ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతూ గడుపుతున్నాడు. ఈ నెల 21న భార్య దివ్యతో పాటు పిల్లలను సమీపంలోనే ఉన్న అత్తవారి ఇంటి వద్ద వదిలేసి ఇంటి వచ్చాడు. ఆదివారం ఉదయం నుంచి ఫోన్‌ తీయకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్‌



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నర్సయ్యగౌడ్‌

భవిష్యత్తు ఎన్నికల్లో బీజేపీదే హవా

- పార్టీ నేషనల్‌ కౌన్సిల్‌ సభ్యుడు డాక్టర్‌ బూర నర్సయ్యగౌడ్‌

యాచారం: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ నేషనల్‌ కౌన్సిల్‌ సభ్యుడు డాక్టర్‌ బూర నర్సయ్యగౌడ్‌ అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పలువురికి సభ్యత్వాలు అందజేశారు. అనంతరం బూర మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందన్నారు. రుణమాఫీ పెద్ద డ్రామాగా మారిందని ఆరోపించారు. కేసీఆర్‌ ప్రభుత్వ విధానాలనే రేవంత్‌రెడ్డి సర్కార్‌ అవలంబిస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కమలం పార్టీకి అధికారం ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారని స్పష్టంచేశారు.

యజ్ఞంలా భావించాలి..

పార్టీ మరింత బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికీ సభ్యత్వాన్ని అందజేయాలని బూర సూచించారు. సభ్యత్వ నమోదును యజ్ఞంగా భావించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కిసాన్‌ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్‌, ఇబ్రహీంపట్నం మున్సిపల్‌ కౌన్సిలర్‌ నాయిని సత్యనారాయణ, నాయకులు టేకుల రాంరెడ్డి, గోగికార్‌ రమేష్‌, శ్రీనివాస్‌ గుప్తా, విజయకుమార్‌, బీరప్ప, నరేందర్‌గౌడ్‌, ఐలేష్‌, రాజు, మల్లేశ్‌, వేణు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అనంతరెడ్డి తదితరులు

ఆమనగల్లు: వాగుపై వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మాజీ వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధి మంగళపల్లి నుంచి చెన్నారం వెళ్లే మార్గంలోని వాగుపై వంతెన లేని కారణంగా ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వాగు ప్రవహించిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని వెల్లడించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అదే విధంగా మండల పరిధి మేడిగడ్డతండాలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కేఎస్‌ఆర్‌ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్‌, కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌, వెంకట్‌రెడ్డి ఉన్నారు.